ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 16-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- శాంతి గురించి మాట్లాడితే ప్రపంచం భారత్ మాట వింటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు.
- బోడో లాండ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.
- వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ లు త్వరలో భూమిని చేరనున్నారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30న ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శాంతి గురించి మాట్లాడితే ప్రపంచం భారత్ మాట వింటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. AI పరిశోధకుడు, పాడ్‌కాస్టర్ లెక్స్ ఫ్రిడ్‌మాన్‌తో జరిగిన పాడ్‌కాస్ట్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ భారతీయులు సామరస్యాన్ని ప్రోత్సహిస్తారని, శాంతి కోసం నిలబడతారని ఉద్ఘాటించారు. భారతదేశం.. గౌతమబుద్ధుడు, మహాత్మాగాంధీలు తిరుగాడిన నేల అని అన్నారు. రష్యా-ఉక్రెయిన్ వివాదంపై మోదీ మాట్లాడుతూ.. రెండు దేశాలు చర్చలకు వచ్చినప్పుడే వివాదానికి పరిష్కారం వస్తుందని చెప్పారు. ఉక్రెయిన్ తమ మిత్రదేశాలతో అనేక చర్చలు జరపవచ్చునని అయితే ఇరు దేశాలు చర్చలలో చేరకపోతే అది ఫలించదని అన్నారు. భారత్, చైనాలు ప్రపంచ అభివృద్ధికి దోహదపడ్డాయని, ఇరు దేశాల మధ్య బలమైన సంబంధాలు భవిష్యత్తులో కొనసాగాలని ప్రధాని అభిప్రాయపడ్డారు. పొరుగు దేశాల మధ్య విభేదాలు ఉన్నాయని, అప్పుడప్పుడు అభిప్రాయభేదాలు తలెత్తుతాయని, ఆ విభేదాలు వివాదాలుగా మారకుండా చూసుకోవడమే తమ లక్ష్యమని ప్రధాని పేర్కొంటూ..

(వాయిస్..33 సెకన్లు)-సెట్

తన శక్తి తన పేరులో లేదని, తన వెన్నంటి నిలిచిన 140 కోట్ల మంది భారతీయులేనని ప్రధాని మోదీ అన్నారు. తాను ఎక్కడికి వెళ్లినా వేల సంవత్సరాల అవిశ్రాంత సంస్కృతి, సాంప్రదాయాల సారాన్ని, స్వామి వివేకానందుని ప్రసంగాలను, 140 కోట్ల మంది ప్రజల కలలు, ఆకాంక్షలు, ఆశీస్సులు తనతో ఎప్పుడు తీసుకువెళ్తానని చెప్పారు. విమర్శను తాను ఎప్పుడూ స్వీకరిస్తానని ప్రజాస్వామ్యంలో దీనికి స్థానం ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ రిజర్వ్ బ్యాంక్ యుకేలోని సెంట్రల్ బ్యాంకింగ్ నుంచి డిజిటల్ ట్రాన్స్ఫర్ మేషన్ అవార్డ్ కు ఎంపిక కావడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా అభినందనలు తెలిపారు. ఇది ఆవిష్కరణలు, ప్రభుత్వ సమర్ధతను ప్రతిబింబిస్తుందని అన్నారు. డిజిటల్ ఆవిష్కరణలు భారతీయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, అనేక మంది జీవితాలను శక్తివంతం చేస్తాయని ప్రధాని మోదీ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నాసా వ్యోమగాములను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ISS) కు తీసుకువెళ్ళిన స్పేస్ ఎక్స్ అంతరిక్ష నౌక ISS తో అనుసంధానం పూర్తయింది. భారత కాలమానం ప్రకారం ఉదయం 11.05 నిముషాలకు తాజాగా నాసా పంపిన నలుగురు వ్యోమగాములు ISS లోనికి ప్రవేశించారు. ఈ మిషన్ విజయవంతం కావడంతో సునీతా విలియమ్స్, బుచ్

విల్ మోర్ లు త్వరలో భూమిని చేరనున్నారు. బోయింగ్ స్టార్ లైనర్ లో సమస్యలు రావడంతో వీరు గత తొమ్మిది నెలలుగా ISS లో ఉండాల్సి వచ్చింది. బుధవారంలోగా ఈ ఇద్దరు వ్యోమగాములు ఫ్లోరిడా తీరానికి చేరుకుంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ ఒడియా కవి రమాకాంత రథ్ మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం వ్యక్తం చేశారు. భారత సాహిత్య ప్రపంచంలో రమాకాంత రథ్ ఒక ప్రముఖ వ్యక్తి అని రాష్ట్రపతి ముర్ము తన సందేశంలో పేర్కొన్నారు. ఒడియా సాహిత్యానికి తన మరపురాని కృషితో దేశవ్యాప్త సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని రాష్ట్రపతి అన్నారు. సాహిత్యానికి ఆయన చేసిన విశిష్ట కృషికి గుర్తింపుగా, రమాకాంత రథ్‌కు 2006లో భారతదేశపు మూడవ అత్యున్నత పౌర పురస్కారం అయిన పద్మ భూషణ్ తో పాటు పలు ప్రతిష్టాత్మక సాహిత్య అవార్డులు లభించాయి. అంతే కాకుండా.. భారత సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా, ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా, కేంద్ర ప్రభుత్వంలో పలు కీలక పదవులను నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతిభ కలిగిన విద్యార్థులకు సహకారం అందిస్తామని కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. బీహార్ లోని పాట్నా జిల్లాలో ధనాపూర్ ప్రాంతానికి చెందిన విద్యార్థిని కుష్బూ కుమారితో ఆమె తల్లిదండ్రుల సమక్షంలో ఈరోజు వీడియో కాన్ఫెరెన్సు లో మాట్లాడారు. డాక్టర్ కావాలని కోరుకుంటున్న ఆమె కలను సాకారం చేయడానికి సహాయం అందిస్తామని మంత్రి తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాలికా విద్యను ప్రోత్సాహిస్తున్నారని, నిరుత్సాహ పడవద్దని అన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో కుష్బూకు సైన్స్ కోర్సులో ప్రవేశం కల్పించాలని పాట్నా జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.
సైన్స్ కోర్సులు చదువుకోవాలనుకున్న కుష్బూను తల్లిదండ్రులు ఆర్ట్స్ కోర్సులో చేర్పించారు. దీనితో అసంతృప్తికి గురైన ఆమె తన కలలు చెదిరిపోయాయని మీడియాతో చెప్పింది. ఇవి వైరల్ కావడంతో కేంద్రమంత్రి దృష్టికి వెళ్ళింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బోడో లాండ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు అస్సాంలోని కొక్రాజార్ జిల్లాలో డోద్మాలో జరిగిన ఆల్ బోడో స్టూడెంట్స్ యూనియన్ 57వ వార్షిక సమావేశంలో అమిత్ షా ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. బోడో ఒప్పందంలోని 82 శాతం అంశాలను ఇప్పటికే నెరవేర్చామని, మిగిలినవి రానున్న రెండేళ్లలోపు పూర్తి చేస్తామన్నారు. బోడో లాండ్ టెరిటోరియం రీజియన్ లో నేడు శాంతి నెలకొందని యువత అభివృద్ధిని కోరుకుంటున్నారని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ఈ ప్రాంత యువత ప్రధాన స్రవంతిలోకి వస్తున్నారని తెలిపారు. ఆల్ బోడో స్టూడెంట్ యూనియన్ మాజీ అధ్యక్షుడు ఉపేంద్రనాధ్ బ్రహ్మ పేరును ఢిల్లీలో ఒక రహదారికి పెట్టామని, ఢిల్లీలో ఆయన ప్రతిమ కూడా ఉందని కేంద్ర మంత్రి అమిత్ షా తెలియజేస్తూ..

(వాయిస్..24 సెకన్లు)-సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూజీలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఐదు రోజుల భారత్ పర్యటన నిమిత్తం ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందంతో ఈరోజు న్యూఢిల్లీకి చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో కేంద్ర మత్స్య, పశు సంవర్ధక పాడి పరిశ్రమ శాఖ సహాయ మంత్రి ఎస్. పి. సింగ్ బాఘెల్ స్వాగతం పలికారు.

రేపు ప్రధానమంత్రి నరేంద్రమోడీతో భారత్, న్యూజీలాండ్ దేశాలకు సంబంధించి పలు అంశాలపై చర్చిస్తారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అనంతరం 10వ రైసిన డైలాగ్-2025 ప్రారంభ సమావేశంలో లక్సన్ ముఖ్య అతిధిగా పాల్గొని కీలక ప్రసంగం చేస్తారు. ప్రధాని లక్సన్ ముంబయిలో వ్యాపారవేత్తలతో సమావేశమవుతారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ పర్యటన జరుగుతుంది. అదే విధంగా రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు న్యూజీలాండ్ ప్రధాని లక్సన్ మర్యాదపూర్వకంగా కలుస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పరస్పర ప్రయోజనకరంగా నిలిచే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభించినట్లు భారత్ న్యూజీలాండ్ దేశాలు ప్రకటించాయి. ఈరోజు న్యూఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ న్యూజీలాండ్ వాణిజ్య, పెట్టుబడుల శాఖా మంత్రి టాడ్ మెక్ క్లే మధ్య జరిగిన సమావేశం ఈ దిశగా ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. ఇది రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యంలో ఒక నూతన మైలు రాయిని సూచిస్తుందని మంత్రి పీయూష్ గోయల్ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత పెంపొందించడానికి, మరిన్ని ఆర్థిక అవకాశాలను విస్తరించడానికి దోహదపడుతుందని మంత్రి పీయూష్ గోయల్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (NCB) ఇటీవల ఇంఫాల్ గౌహతి జోన్ల పరిధిలో 88 కోట్ల రూపాయల విలువైన మెథాఫెటమైన్ మాత్రలను స్వాధీనం చేసుకొని అంతర్జాతీయ మాదకద్రవ్య ముఠాకు చెందిన నలుగురు సభ్యులను అరెస్టు చేసింది. ఈ సందర్భంగా NCB పనితీరును కేంద్ర హోం మంత్రి అమిత్ షా సామాజిక మాధ్యమంలో అభినందించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =